# నమస్తే తెలంగాణ
# కామారెడ్డి

5 | నిజామాబాద్, సోమవారం 26 మే 2025 | KAMAREDDY


## ఆరుద్ర ఆగమనం



నాగిరెడ్డిపేట మండలం గోపాల్‌పేట శివారులో కనిపించిన ఆరుద్ర పురుగులు

నాగిరెడ్డిపేట, మే 25: ఆరుద్ర కార్తె పేరు వినగానే మొదట గుర్తుకువచ్చేవి ఆరుద్ర పురుగులు. ఆరుద్ర కార్తె సమయంలో విరివిగా కనిపించే ఈ పురుగులు నెల ముందుగానే కనిపించి కనువిందు చేస్తున్నాయి. ప్రతి ఏటా వర్షాకాలం ప్రారంభంలో ఆరుద్ర కార్తెలో భూములు, బీడు భూముల్లో ఇవి కనిపిస్తుంటాయి. కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట మండలం గోపాల్‌పేట్ శివారులోని పొలాల్లో ఆరుద్ర పురుగులు దర్శనమిచ్చాయి. ఆరుద్ర పురుగులు కనిపించడంతో ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని రైతులు విశ్వసిస్తారు.

## వీధి కుక్కల దాడిలో జింక మృతి




జింక కళేబరాన్ని పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

పొతంగల్, మే 25 : మండలంలోని సోంపూర్ గ్రామంలో ఆదివారం వీధి కుక్కల దాడిలో ఓ జింక మృతి చెందింది. స్థానికులు, అటవీశాఖ బీట్ ఆఫీసర్ వందన తెలిపిన వివరాల ప్రకారం.. సోంపూర్ పొలాల్లో నుంచి గ్రామం వైపునకు వీధి కుక్కలు జింకను తరిమి దాడి చేశాయి. ఈ దాడిలో జింక మృతి చెందగా, స్థానికులు గమనించి వీధి కుక్కలను తరిమివేశారు. జింక మృతి చెందిన విషయాన్ని అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో అటవీశాఖ సిబ్బంది అక్కడికి చేరుకొని పంచనామా నిర్వహించారు. గ్రామంలో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయని, కనిపిస్తే చాలు దాడులు చేస్తున్నాయని గ్రామస్తులు వాపోయారు. వీధి కుక్కల బెడద నివారణకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

- సమాధానం చెప్పలేక తలలు పట్టుకుంటున్న అధికార పార్టీ నేతలు
- సర్కారు వైఫల్యాలను ఎండగడుతున్న అన్నదాతలు
- ఉమ్మడి జిల్లాలో 1.77లక్షల మందికి మొండి 'చేయి'
- పది నెలలవుతున్నా పూర్తికాని 'మాఫీ' ప్రక్రియ
- ప్రభుత్వ తీరుపై అసహనం వ్యక్తంచేస్తున్న రైతులు


### బ్యాంకర్ల నుంచి వేధింపులు..

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.2లక్షల పంట రుణాలను రద్దు చేస్తామని పీసీసీ చీఫ్ హోదాలో రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. అనేక బహిరంగసభలు, ఎన్నికల ప్రచారంలోనూ స్పష్టం చేశారు. 2023 డిసెంబర్ 7న అధికారంలోకి వచ్చిన తర్వాత మాట మార్చారు. వంద రోజుల్లోనే పంట రుణాలను మాఫీ చేస్తామని చెప్పిన నేతలే రైతులను దగా చేస్తున్నారు. బీఆర్‌ఎస్ పార్టీ వెంటాడి రుణమాఫీ కోసం ఉద్యమించడంతో చేసేది లేక 2024, ఆగస్టు 15న రుణమాఫీకి కాంగ్రెస్ ప్రభుత్వం తప్పనిసరి పరిస్థితుల్లో శ్రీకారం చుట్టింది. అరకొరగా పంట రుణాలను మాఫీ చేసింది. ఆ తర్వాత రైతులంతా రోడ్డు ఎక్కి కాంగ్రెస్ నేతలను నిలదీయడంతో రెండు, మూడు విడుతల్లోనూ రుణమాఫీ జరిగింది. తీరా రుణమాఫీ రాని వారంతా ఆందోళన చేయడంతో చివరిగా నాలుగో విడుతను సైతం విడుదల చేసింది. అయినప్పటికీ సగం మందికిపైగా రైతులు ఇప్పటికీ మాఫీ కోసం వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారు. మొత్తం పంట రుణాలను చెల్లించలేక, వడ్డీలు కట్టలేక ఇబ్బందులు పడుతుండగా.. మరోవైపు బ్యాంకు అధికారుల నుంచి తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు.




# రుణమాఫీ సెగలు!

నిజామాబాద్, మే 25 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): రైతులందరికీ రుణమాఫీ చేయడంలో రేవంత్ సర్కార్ ఘోరంగా విఫలమైంది. రూ. 2లక్షల రుణమాఫీ చేస్తామని అసెంబ్లీ ఎన్నికల వేళ రైతులకు ఇచ్చిన హామీని పూర్తిస్థాయిలో అమలుచేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నది. దీంతో ఉమ్మడి జిల్లాలోని రైతులు రుణమాఫీపై కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులను నిలదీస్తున్నారు. దీనిపై రైతులకు సమాధానం చెప్పలేక అధికార పార్టీ నేతలు తలలు పట్టుకుంటున్నారు. ఇటీవల రెంజల్‌లో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు పర్యటించగా..రైతులు చుట్టుముట్టి రుణమాఫీపై ప్రశ్నించారు. ప్రజావాణి కార్యక్రమంలోనూ ఫిర్యాదులు చేస్తున్నారు. అయినా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులకు రైతుల నుంచి నిరసన సెగలు తప్పడంలేదు. సీఎం రేవంత్‌రెడ్డి పీసీసీ హోదాలో ఇచ్చిన హామీకే దిక్కులేకుండా పోయిందని అన్నదాతలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఎన్నిలకు ముందు ఓ మాట.. అధికారం వచ్చాక మరో మాట మార్చడంపై మండిపడుతున్నారు. ఉమ్మడి జిల్లాలో రైతురుణమాఫీ ప్రక్రియ ఒక అడుగు ముందుకు, పదడుగులు వెనక్కిలా మారింది. గతేడాది ఆగస్టు 15న మొదలైన ఈ ప్రక్రియ నాలుగు విడుతలుగా అమలై ఆగిపోయింది. సగాని కన్నా తక్కువ మందికి మాత్రమే రుణమాఫీ వర్తించడంతో మిగతావారి పరిస్థితి ఇప్పుడు అగమ్యగోచరంగా మారింది. మా పరిస్థితి ఏమిటి? అంటూ రైతులు ఎక్కడికక్కడ కాంగ్రెస్ నాయకులను నిలదీస్తుండడం గమనార్హం. రుణమాఫీ కోసం చెప్పులరిగేలా రైతులు తిరుగుతున్నప్పటికీ పాలకుల్లో శ్రద్ధ కనిపించడం లేదు. రుణమాఫీ పేరు ఎత్తాలంటేనే కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు వణికి పోతున్నారు. తమ ప్రసంగాల్లో మొన్నటి వరకూ రుణమాఫీ చేశామంటూ చెప్పుకొచ్చిన వారంతా ఇప్పుడు రుణమాఫీ పేరు ఎత్తాలంటే వెనుకడుగు వేస్తున్నారు.



ఉమ్మడి జిల్లాలో 1.77లక్షల మందికి మొండి 'చేయి'

### ఎక్కడికక్కడ నిలదీతలు



రెంజల్‌లో ఏప్రిల్ 28న భూభారతిపై అవగాహన సదస్సుకు హాజరైన కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతును రుణామాఫీపై ప్రశ్నిస్తున్న రైతులు (ఫైల్)

రెంజల్ మండలంలో కలెక్టర్‌ను రైతులు చుట్టుముట్టి రుణమాఫీ వర్తింపజేయాలంటూ ప్రశ్నలు సంధించారు. అచ్చంగా ఇలాంటి పరిస్థితే నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లోనూ కనిపిస్తున్నది. ప్రభుత్వతీరుపై రైతుల్లో నివురు గప్పిన నిప్పులా అసంతృప్తి పేరుకు పోయింది. కాంగ్రెస్ నేతలెవరైనా ఎదురు పడితే చాలు రుణమాఫీపై నిలదీస్తుండడంతో సరైన సమాధానం చెప్పలేక తలలు పట్టుకుంటున్నారు. వ్యవసాయ శాఖ అధికారులకు ఫోన్లు చేసి వివరాలు కనుక్కునే ప్రయత్నాలు చేస్తుండగా ప్రభుత్వ వైఫల్యమే కారణమని సమాధానం వస్తుండడడంతో రైతులను నచ్చజెప్పలేక చతికిల పడుతున్నారు.

నిజామాబాద్ జిల్లాలో మొత్తం 2లక్షల 3వేల 520 మంది రైతులున్నారు. వీరిలో లక్షా 555 మందికి రూ.781కోట్లు పంట రుణాలు రద్దు చేశారు. ఇంకా లక్షా 2వేల 265 మందికి రుణమాఫీ కాలేదు. కామారెడ్డి జిల్లాలో లక్షా 76వేల మంది రైతులు రుణాలు తీసుకోగా ఇందులో లక్షా ఒక వేయి 417 మందికి రూ.736కోట్లు రుణమాఫీ వర్తించింది. 75వేల మందికి మొండిచేయి చూపారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 1.77లక్షల మందికి రుణమాఫీ కావాల్సి ఉన్నది. రుణమాఫీ జాబితాను రూపొందించడంలో బ్యాంకర్లు, సహకార శాఖ, వ్యవసాయ శాఖ అధికారుల తప్పిదాలు.. రైతులకు శాపంగా మారాయి.కొద్ది మంది రైతులను ప్రభుత్వ ఉద్యోగులుగా చిత్రీకరించి అనర్హులుగా మార్చారు. మరికొంత మందికి రైతుల ఆధార్ కార్డు నంబర్లను తప్పుగా నమోదు చేశారు. పట్టాదారు పాసుపుస్తకాల వివరాల్లోనూ తప్పులను వ్యవసాయ శాఖ పేర్కొంది. రైతులు తీసుకున్న రుణాలను నమోదు చేయడంలో సహకార సంఘాల్లోని ఉద్యోగులు పొరపాట్లు చేయడం కూడా రుణమాఫీ రాకపోవడానికి కారణాలుగా కనిపిస్తున్నాయి. వివరాలు సవ్యంగా ఉన్నప్పటికీ, సర్కారు కొర్రీలు విధించిన నిబంధనల మేరకు అర్హతలు కలిగిన రైతులకు సైతం ఇంత వరకూ రుణమాఫీ జాబితాలో పేరు నమోదుచేయలేదు. దీంతో వీరంతా కాంగ్రెస్ ప్రభుత్వంపై నిప్పులు చెరుగుతున్నారు.

పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కామారెడ్డి కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్



## ప్రశాంతంగా గ్రామపాలన అధికారుల పరీక్ష


కామారెడ్డి, మే 25 : కామారెడ్డి జిల్లాలో ఆదివారం గ్రామ పాలన అధికారుల ఎంపిక పరీక్ష ప్రశాంతంగా నిర్వహించినట్లు కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో గ్రామ పాలన అధికారుల స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించారు. పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. పరీక్షకు 401 మంది అభ్యర్థులకు గాను 377 మంది హాజరవగా, 24 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ విక్టర్, కళాశాల ప్రిన్సిపాల్ విజయ్ కుమార్, కలెక్టరేట్ పరిపాలన అధికారి మసూద్ అహ్మద్ తదితరులు ఉన్నారు.



## బోధన్ సరిహద్దులో చెక్‌పోస్టులు ఏర్పాటు

బోధన్ రూరల్, మే 25 : బక్రీద్ పండుగను పురస్కరించుకొని మహారాష్ట్ర నుంచి పశువులను మన రాష్ట్రంలోకి అక్రమంగా తరలించకుండా రెండు చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. బోధన్ మండలంలోని ఖండ్‌గామ్, సాలూర మండల శివారులో అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు, మహారాష్ట్ర – తెలంగాణ సరిహద్దు ప్రాంతాల్లో పోలీస్ చెక్‌పోస్టు ఏర్పాటు చేసి తనిఖీలు చేపడుతున్నారు. పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బోధన్ రూరల్ ఎస్సై మశ్చేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో మహారాష్ట్ర నుంచి వచ్చే వాహనాలను తనిఖీ చేస్తున్నారు. పశువులను ఒక చోట నుంచి మరోచోటికి తరలిస్తే పశువైద్యాధికారుల అనుమతి తప్పని సరిగా తీసుకోవాలని సూచిస్తున్నారు.

# నోళ్లు తెరిచిన నాలాలు..





గోల్డెన్ జూబ్లీ స్కూల్ వెనుకభాగంలో పైకప్పు లేని నాలాలు

- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందుల్లో నగరవాసులు

కంఠేశ్వర్, మే 25 : కొన్నిరోజులుగా కురుస్తున్న వర్షాలకు నిజామాబాద్ నగరంలో రోడ్లు, నాలాలు జలమయమవుతున్నాయి. మురికి కాలువల్లోని నీరు రోడ్లపైకి చేరుతున్నది. పలు డివిజన్లలో మురికి నాలాలు ప్రమాదకరంగా మారాయి. చిన్నపాటి వర్షం కురిస్తేచాలు వాగులను తలపిస్తున్నాయి. నాలాలు నిండిపోయి చెత్తపేరుకుపోతున్నది. దీంతో అది నాలానా లేక సాధారణ మార్గమా గుర్తించలేని పరిస్థితి దాపురించింది. ఏదైనా ప్రమాదం జరిగితే తప్ప అధికారులు నాలాలపై దృష్టి సారించడం లేదు. నగరంలోని అర్సపల్లి, మాలపల్లి, వర్ని రోడ్, సాయినగర్, రైల్వేస్టేషన్, దుబ్బ, గంజ్ మార్కెట్ తదితర ప్రాంతాల్లో చిన్నపాటి వర్షం కురిస్తే చాలు రోడ్లపైకి వర్షపు నీరు చేరి చెరువులను తలపిస్తున్నాయి. ఇక ఓపెన్ నాలాల విషయమైతే చెప్పాల్సిన పని లేదు. వర్షం కురిస్తే చిన్న పిల్లలను బయటికి పంపాలంటేనే భయపడాల్సిన పరిస్థితి నెలకొన్నది. గతేడాది వర్షాకాలంలో ఆనంద్‌నగర్ ప్రాంతంలో నాలాలు నిండుగా ప్రవహించడం, నాలా పైకప్పు లేకపోవడంతో రెండేండ్ల చిన్నారి వర్షపు నీటికి కొట్టుకుపోయింది. వర్షాలు కురుస్తున్నందున అధికారులు స్పందించి ఓపెన్ నాలాలను గుర్తించి పైకప్పులు లేదా ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని నగరవాసులు కోరుతున్నారు. ప్రమాదాలు జరిగిన తర్వాత హడావుడి చేసే అధికారులు.. మానవతా దృక్పథంతో ముందుగానే స్పందించి ప్రమాదాల నివారణతోపాటు ప్రాణనష్టం జరగకుండా చూడాలని విన్నవిస్తున్నారు.

### పూడికతీత పనులు కొనసాగుతున్నాయి

"నగరంలో మురికి కాలువలు, నాలాలు అన్ని పూడికలు తీసే పనులు కొనసాగుతున్నాయి. ప్రమాదకరంగా ఉన్న నాలాలను గుర్తించాలని సిబ్బందికి ఆదేశాలు ఇచ్చాం. ప్రమాదాలు జరగకుండా అన్ని చర్యలు తీసుకుంటాం."

\- దిలీప్‌కుమార్, నిజామాబాద్, నగరపాలక సంస్థ కమిషనర్



ఖిల్లా ప్రాంతంలో..

ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలు

## ప్రాజెక్టుల్లోకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

మోర్తాడ్, మే 25: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతం నుంచి ఆదివారం 2,315 క్యూసెక్కుల వరద వచ్చినట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1091అడుగులు (80.5టీఎంసీలు) కాగా ప్రస్తుతం 1061.60 అడుగుల (12.07టీఎంసీలు) నీటి నిల్వ ఉన్నది. ప్రాజెక్ట్ నుంచి కాకతీయకాలువకు 100 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా, 321 క్యూసెక్కుల నీరు ఆవిరిరూపంలో వెళ్తున్నది.

### నిజాంసాగర్ ప్రాజెక్టులోకి 436 క్యూసెక్కుల వరద

బాన్సువాడ / నిజాంసాగర్, మే 25 : ఎండాకాలం ముగియకముందే కురుస్తున్న భారీ వర్షాలకు మంజీరకు స్వల్ప వరద మొదలైంది. రెండు మూడు రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న ఆడపదడపా వానలకు కామారెడ్డి జిల్లాలోని నిజాంసాగర్ ప్రాజెక్టులోకి స్వల్పంగా ఇన్‌ఫ్లో వచ్చి చేరుతున్నది. శంకరంపేట్, జోగిపేట్ తదితర ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షానికి ఆదివారం ప్రాజెక్టులోకి 436 క్యూసెక్కుల వరద వచ్చి చేరినట్లు ప్రాజెక్టు ఏఈఈ శివ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 17.802 టీఎంసీలకు(1405.00 అడుగులు) గాను ప్రస్తుతం 5.706 టీఎంసీల (1393.26 అడుగులు) నీరు నిల్వ ఉన్నదని పేర్కొన్నారు.



నిజాంసాగర్ ప్రాజెక్ట్